క్లుప్తంగా

జ్యోతుల ఉత్సవం ప్రారంభం


ముస్తాబైన చౌడేశ్వరిదేవి ఆలయం

గోస్పాడు: మండలంలోని కానాలపల్లి గ్రామంలో చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. 15 సంవత్సరాల క్రితం గ్రామంలో జ్యోతుల మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు నిర్వహిస్తుండటంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయాన్ని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి నుంచి జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహించడంతో పాటు మరుసటి రోజు అమ్మవారికి బోనాల సమర్పణ ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి


గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని నంద్యాల మెడికల్ కళాశాల హెచ్ఓడీ విజయకుమారి తెలిపారు. ప్రపంచ హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని చాపిరేవుల గ్రామంలోని రక్తపోటు బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక పీహెచ్సీ వైద్యులు షహలాం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తీవ్రమైన తలనొప్పి, ఛాతికొట్టుకోవడం, అక్రమమైన హృదయ స్పందనలతో అధిక రక్తపోటు వస్తుందన్నారు. అధిక రక్తపోటు రెండు రకాలుగా ఉంటుందని, ప్రారంభంలో గుర్తించి నివారణ చర్యలు చేపడితే ప్రమాదం నుంచి బయటపడవచ్చన్నారు. ప్రొఫెసర్లు డాక్టర్ జాహ్నవి, హేమలత, ప్రసన్న పాల్గొన్నారు.

మాన్యం భూములకు వేలంపాట


క్రిష్టిపాడులో వేలం పాట నిర్వహిస్తున్న ఈఓ

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో నాగేశ్వర, చెన్నకేశవ స్వామి దేవాస్థానములకు చెందిన 52.04 ఎకరాల మాన్యం భూములను కౌలువేలం పాట నిర్వహించగా రూ.9.30 లక్షలు వచ్చినట్లు ఈఓ బాలచెంచన్న చెప్పారు. అలాగే కొండాపురంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన 28.01 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.5,55,500 వచ్చిందన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరు మెట్ట వద్ద విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. చిన్నకంబలూరుకు చెందిన రైతు శీను పాడి గేదెల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. దిన చర్యలో భాగంగా శనివారం ఉదయం రైతు పాడిగేదెలను మేపేందుకని గ్రామం సమీపంలో ఉన్న మెట్ట వైపు తీసుకెళ్లాడు. మాగాణి పొలాల్లో గ్రాసం మేస్తూ ఓ గేదె పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వైపు వెళ్లింది. తెగి పడిప విద్యుత్ తీగను తాకడంతో గేదె విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.90వేల వరకు ఉంటుందని రైతు తెలిపాడు. పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్‌కు సమాచారం అందించడంతో ఆయన అక్కడికి చేరుకుని పరిశీలించారు.

నివాళి

చాగలమర్రి: మండల కేంద్రంలోని వినాయక నగర్‌లో నివాసం ఉంటున్న ప్రవీణ్(30) ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి చాగలమర్రికి చేరుకొని ప్రవీణ్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వరిసాగుకు సేంద్రియ ఎరువులే ఉత్తమం

బనగానపల్లె రూరల్: వరి సాగులో సేంద్రియ ఎరువులే ఉత్తమమని మహానంది వ్యవసాయ కళాశాలకు చెందిన డాక్టర్ పీవీ గీతా శిరీషా అన్నారు. శనివారం యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వరిసాగులో సేంద్రియ ఎరువులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రైతులు పర్యావరణానికి అనుకూలంగా ఉండే సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగను పొలంలో కలియ దున్నడం వల్ల చౌడుభూములను సమర్థవంతంగా నిరోధించవచ్చన్నారు. డాక్టర్ శివజ్యోతి మట్టి పరీక్షల అవశ్యకత, సమగ్రపోషక యాజమాన్యం తదితర వాటిపై అవగాహన కల్పించారు.

నత్తనడకన అభివృద్ధి పనులు

- కాంట్రాక్టర్ల అలసత్వంపై కౌన్సిలర్ల అసహనం
- కుక్కల బెడద, పారిశుద్ధ్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(న్యూటౌన్): కాంట్రాక్టర్ల అలసత్వంతో పట్టణంలో నత్తనడకన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కుక్కల బెడద, పారిశుద్ధ్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశాన్ని చైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో 16 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 42 వార్డుల్లో మంజూరైన అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు కొన్నింటిని ప్రారంభించి, మరికొన్ని కొంతమేర చేపట్టి పూర్తి చేయకుండా అలసత్వం వహిస్తుండటంపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధి నత్త నడకన సాగుతోందని అనేకమార్లు సమావేశంలో కౌన్సిలర్లు ప్రస్తావించినా నేటికీ పరిష్కారం కాలేదన్నారు. మున్సిపాలిటీ అంటే కేవలం అధికారులు మాత్రమే కాదని, ప్రజా ప్రతినిధులైన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లని గుర్తుంచుకోవాలన్నారు. పట్టణాభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తున్నప్పటికీ, కాంట్రాక్టర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో అందరికీ చెడ్డపేరు వస్తోందని, అలాగే.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి పనులను పూర్తి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఇన్‌చార్జి కమిషనర్ వెంకటదాసును కోరారు. పనులను పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులకు సూచించారు. 33వ వార్డులో పైప్‌లైన్ పనులను, కల్వర్ట్‌లను ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ మనోరంజని కోరింది. పట్టణంలోని మున్సిపల్ డైలీ మార్కెట్ ఫ్రూట్ మార్కెట్ సంబంధించిన దుకాణాలు శిథిలావస్థలో ఉన్నాయని వర్షాకాలంలో కూలి ప్రమాదాలకు దారి తీయవచ్చని వెంటనే చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ సాధిక్ బాషా కోరారు. వర్షకాలం నేపథ్యంలో గాంధీ చౌక్ నుంచి శ్రీనివాస సెంటర్ వరకు మురుగు కాలువల నుంచి సిల్ట్ తీయించాలని కౌన్సిలర్ అబ్దుల్ మజీద్ సూచించారు. వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు,అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


డాక్టర్ జయంతిని సన్మానిస్తున్న దృశ్యం,


ఏపీరెడ్డిని సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు


జయబాబును సన్మానిస్తున్న దృశ్యం

గోస్పాడు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. డాక్టర్ జయంతి కంటి వైద్య విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా నంద్యాలలోని మెడికల్ కళాశాలలో ఆమెను కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్లు, డాక్టర్లు ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాళ్లు రాజశేఖర్, బాలీశ్వరి, బయోకెమిస్ట్రీ హెచ్ఓడీ కళావతి, డాక్టర్లు పాల్గొన్నారు.

- నంద్యాల(అర్బన్): ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వ్యాయామ ఉపాధ్యాయుడు ఏ.పిచ్చిరెడ్డి శనివారం పదవీ విరమణ పొందారు. మండలంలోని చాబోలు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విమరణ పొందిన ఏపీరెడ్డిని అదే పాఠశాలలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అలాగే.. తెలుగుగంగ ప్రాజెక్టులో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన జయబాబును జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఘనంగా సన్మానించింది. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్, ఉపాధ్యక్షుడు శీను, డ్రైవర్లు పాల్గొని జయబాబును శాలువా, పూలమాలలతో సత్కరించారు.

వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించడమే ధ్యేయం




రామకృష్ణారెడ్డికి మొమెంటో అందజేస్తున్న కమాండర్లు,శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లు

నంద్యాల(న్యూటౌన్): వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించడమే ధ్యేయమని 600 మందిని ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ ఇస్తామని కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి అన్నారు. శనివారం స్థానిక శ్రీరామకృష్ణ అటానమస్ పీజీ కళాశాలలో 9వ ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ కర్నూలు వారి ఆధ్వర్యంలో పది రోజుల పాటు ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో డ్రిల్, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ హైజీన్, యోగా గెస్ట్ లెక్చరర్స్, ఫైరింగ్ స్పోర్ట్స్, యూనిటీ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, తల్‌సైనిక్ క్యాంప్, రిపబ్లిక్ డే ఫేరెడ్ ఎంపిక తదితర అంశాలు ఉంటాయన్నారు. క్యాంప్ కమాండెంట్‌గా కల్నల్ జోబీఫిలిప్, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్‌గా లెఫ్టినెంట్ కల్నల్, క్యాంప్ కమాండెంట్‌గా కల్నల్ ప్రియ వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్లు డాక్టర్ లలితా సరస్వతి, కమాల్‌ఖాన్, లక్ష్మీదుర్గా గీతాంజలి, శ్రీదేవి ధర్మేంద్ర కుమార్, ఎస్ఎస్ రెడ్డి, సువేదర్‌బాషా పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న మూడో అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజ

నంద్యాల(వ్యవసాయం): జూలై 5వ తేదీన జరిగే మెగా జాతీయ లోకాదాలత్ విజయవంతం చేయాలని మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజ, జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ లక్ష్మీ కర్రి పేర్కొన్నారు. శనివారం కోర్ట్ ఆవరణలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల ప్రకారం రాజీ కాగల కేసుల్లో కక్షిదారులను ప్రోత్సహించాలని పోలీసు అధికారులకు సూచించారు. కుటుంబ కలహాలు, ఎంసీ కేసులు, పెట్టీ, ఎక్సైజ్ తదితర కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్లలో రాజీ కాగల కేసుల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ ఎస్పీ మంద జావలి, వన్‌టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి, టు టౌన్ సీఐ కంబగిరి రాముడు, ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా, పీపీ శ్రీనివాసులు, లోకాదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, ఉమాదేవి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

గోస్పాడు: పేదలకు స్థలాలు కేటాయించాలని సీపీఐ నాయకులు హరినాథ్, జిలానీ బాషా డిమాండ్ చేశారు. మండల కేంద్రం గోస్పాడులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంతోమంది పేదలు గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, సొంత ఇల్లు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈనెల 3వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పోస్టర్లు విడుదల చేశారు. పాపన్న, ముల్లా హుసేన్. ఆలీబాషా, పోతులూరయ్య, అంకన్న పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనర్థమే


ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం


కరపత్రాలను అందజేస్తున్న ఐడీఏ నాయకులు

గోస్పాడు: పొగాకు ఉత్పత్తుల వాడకం మంచిది కాదని, దీని వల్ల ఆరోగ్యానికి హానికరమేనని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. శనివారం నంద్యాల డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం వద్ద అనదపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ శారదాబాయి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శన్‌బాబు ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను వాడటం వల్ల పలు రకాల క్యాన్సర్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వీటి వల్ల అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవాల్సి వస్తుందని, ప్రతి ఒక్కరు గమనించి పొగాకు వాడకాన్ని మానాలని కోరారు. ఏఓ డాక్టర్ భరత్, డాక్టర్ అష్రాఫ్‌అలీ, సూపరింటెండెంట్ గురుస్వామి, కో ఆర్డినేటర్ చిన్న వీరన్న పాల్గొన్నారు.

పొగాకుతో పర్యావరణానికీ ముప్పే

నంద్యాల(వ్యవసాయం): పొగాకు వాడకం మన ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తుందని పర్యావరణాన్ని కూడా నాశనం చేస్తుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ కె.కిశోర్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని భారతి సీడ్స్ కార్యాలయంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ×ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వాడకం-దుష్ఫలితాలపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పొగాకులో ఉండే కార్బన్ మోనాక్సైడ్, సైనైడ్ పదార్థాలు ఊపిరితిత్తుల పనితీరును దెబ్బతీసి ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను కలుగజేస్తాయని తెలిపారు. నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. పొగాకు రహిత సమాజం కోసం అందరం కృషి చేయాలన్నారు. ముఖ్యఅతిథి విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కాదరబాద్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ పొగాకు సాగుకు రసాయన ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా ఉపయోగించడం వల్ల నేల నిస్సారమవుతుందని, ఇతర ఆహారపంటల ఉత్పత్తి తగ్గుతుందన్నారు.కవులు అన్నెం శ్రీనివాసరెడ్డి, నీలం వెంకటేశ్వర్లు,నీలకంఠమాచారి, రఫీ, నంది రైతు సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు జోలికెళ్లొద్దు


ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: పొగాకు అలవాటును మాని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారి బాబు సూచించారు. మండల పరిధిలోని నర్సాపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. చుట్ట, బీడీ, సిగరెట్, గుట్కా తదితర పొగాకు ఉత్పత్తుల జోలికి వెళ్లొద్దంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేశారు.

ధూమపానంతో ఆరోగ్య సమస్యలు

శిరివెళ్ల: ధూమపానంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రభుత్వ వైద్యాధికారి ముఖేష్ కుమార్ అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వాల్ పోస్టర్లను వైద్య సిబ్బంది ఆవిష్కరించారు. డాక్టర్ మాట్లాడుతూ ఏటా పొగాకు వాడకంతో దేశంలో 1.35 మిలియన్ల మంది మరణిస్తుండటం బాధాకరమన్నారు. అనంతరం పొగాకును నిషేధిస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

ఉయ్యాలవాడ: నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్న చౌక దుకాణాల డీలర్లు సమయపాలన పాటించాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి డీలర్ల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డీలరు షాప్ బయట బోర్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి నెల 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు షాపు తెరిచి ఉంచి కార్డుదారులకు సరుకులు అందించాలన్నారు.

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి


శంకర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్.నాయక్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి శంకర్ నాయక్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఒక్క కళాశాలలో కూడా వసతులు సరిగా లేవని, అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. కళాశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. రాజేష్, సందీప్, సాయి, జోసెఫ్, రోహిత్, యశ్వంత్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాటం చేద్దాం

- ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి


చాగలమర్రిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి

ఉయ్యాలవాడ/చాగలమర్రి/దొర్నిపాడు: తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజల పక్షాన పోరాటం చేద్దామని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఉయ్యాలవాడ, చాగలమర్రి, దొర్నిపాడులో శనివారం ఆయా మండలాల నాయకులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జూన్ నెల 4వ తేదీకి ఏడాది పూర్తవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు వెన్నుపోటు దినం పేరుతో ఆళ్లగడ్డ పట్టణంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ఎత్తున ర్యాలీ, నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పనితీరుపై, ప్రజలకు ఇస్తామన్న సూపర్ సిక్స్ పథకాలపై ర్యాలీగా తరలివెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు జూన్ 4 ఉదయం 9 గంటలకు ఆళ్లగడ్డ పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. ఉయ్యాలవాడలో మండల అధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ, పార్టీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు గజ్జెల క్రిష్టారెడ్డి, చాగలమర్రిలో మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్. బాబులాల్, జిల్లా అధ్యక్షుడు షేక్.షబ్బీర్, ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీటీసీలు కె.లక్ష్మీరెడ్డి, ఎం.ఫయాజ్, వ్యాపారవేత్త చక్రం ముల్లా షబ్బీర్ అహమ్మద్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి శేషురమేష్, ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, దొర్నిపాడులో పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు భూమా చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. మూడవ తరగతితో పాటు ఖాళీగా ఉన్న నాలుగు, ఐదు, ఆరు, ఏడవ తరగతులలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 3వ తరగతిలో ప్రవేశానికి ఎస్టీ - 31, ఎస్సీ - 5, బీసీ - 1, ఓసీ -1 ఏజెన్సీ (పాఠశాలలో పనిచేసే వారు) - 1 సీట్లు ఉన్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సరైన ధ్రువపత్రాలతో పాఠశాల వద్దకు వచ్చి దరఖాస్తులను అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9676010006 సంప్రదించాలన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో శనివారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పరిశీలించారు. లబ్ధిదారుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు లొస్తే చర్యలు తప్పవని సిబ్బందిని ఆయన హెచ్చరించారు.

సేవలతోనే గుర్తింపు

- జిల్లా సహాయ సాంఘిక సంక్షేమ అధికారి


వాచ్‌మెన్ దంపతులను సన్మానిస్తున్న సంక్షేమాధికారులు

ఉయ్యాలవాడ: ఉద్యోగంలో ఉన్న సమయంలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని జిల్లా సహాయ సాంఘిక సంక్షేమ అధికారి అబ్దుల్ జలీలు అన్నారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం వాచ్‌మెన్ గుర్రాల వెంకటప్ప పదవీ విరమణ పొందారు. శనివారం వెంకటప్ప దంపతులను అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బనగానపల్లె, చిన్న వంగళి, ఉయ్యాలవాడ ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారులు చిన్నరాముడు, ఖాసీం సాహెబ్, శంకరయ్య, విశ్రాంత ఉద్యోగి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పదోన్నతి హెచ్ఎంలకు సన్మానం చేస్తున్న టీచర్లు

పదోన్నతి హెచ్ఎంలకు సన్మానం

శిరివెళ్ల: జెడ్పీ ఉన్నత పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా పదోన్నతి లభించింది. ఇబ్రహీంకు అహోబిలం హెచ్ంగా, సుకుమాంబకు ఆదోని మండలం హరివరం హెచ్ఎంగా, శిరీషాకు సంజామల మండలం గిద్దలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పదోన్నతి లభించింది. వీరితో పాటు పదవీవిరమణ పొందిన నాగేశ్వరరావును శనివారం టీచర్లు సన్మానించారు.

హెచ్ఎం బదిలీ

మండలంలోని పలువురు ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు బదిలీ అయ్యారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయకుమార్ లాంగ్ స్టాండింగ్ కింద మహానంది మండలం తిమ్మాపురం, మహదేవపురం హెచ్ఎం నారాయణరెడ్డి నంద్యాలలోని నందమూరి పాఠశాలకు బదిలీయయ్యారు. వీరిని ఆయా పాఠశాలల టీచర్లు సన్మానించారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు


రుద్రవరం వేంకటేశ్వర స్వామి ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామికి, రుద్రవరం-అప్పనపల్లె దారిలో వెలసిన లక్ష్మీగోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి వార్లకు శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. రుద్రవరంలోని వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆలయ నిర్వాహకులు లక్ష్మీదేవి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠోత్సవం సందర్భంగా వేద పండితు లు మంత్రోచ్ఛరణలతో వివిధ రకాల పూజా కార్యక్రమాలతో పాటు హోమ గుండాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు ఉదయాన్నే నిత్య పూజలు గావించిన అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వాహనాలు,కాలినడకన వచ్చిన భక్తాదులందరు స్వామి అమ్మవార్లకు పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తాదులకు ఆలయ నిర్వహికులు తగిన వసతులు కల్పించారు.